విశాలాంధ్ర

→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

ఆరోగ్య విషయంలో మహిళలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-వైఎస్ఆర్ జిల్లా: ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన వ్యవస్థ స్వయం సహాయక సంఘాలని, అటువంటి పటిష్టమైన సంఘాలలో ఉన్న మహిళలూ... ఆరోగ్య విషయంలో అశ్రద్ధ వద్దని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ సూచించారు. శుక్రవారం ప్రపంచ చిరు ధాన్యాల మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కాఫీ హౌస్ లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల వంటల ప్రదర్శనను జేసి, సబ్ కలెక్టర్లతో తిలకించిన ప్రాజెక్ట్ అధికారి చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు రుచి చూసారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల స్వయం సహాయక బృందాలు చిరు దాన్యాలతో తయారు చేసిన సుమారు 55 రకాల వంటకాలు ప్రదర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి మాట్లాడిన పిఓ ప్రతి మండలంలో కనీసం వంద కొత్త సంఘాలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి అర్హత గల సంఘ సభ్యురాలు రుణాలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రక్త హీనత, సికిలిసెల్ అనీమియా, తలసేమియా లాంటి వ్యాధులు ఉన్నందున మరింత జాగ్రత్త అవసరమన్నారు. ఇటీవల 56 వేల స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తే సుమారు ఐదు వేలు పాజిటివ్ గా ప్రాధమికంగా నిర్ధారించటం జరిగిందని, ఇటువంటి వాటికి గిరిజనులలో అవగాహనా లోపమే కారణమని పిఓ తెలిపారు. చిరు ధాన్యాల వ్యాపారం కోసం విశాఖపట్నంలో స్థలం అడిగామని, అక్కడ 40 నుండి 50 ఆదివాసీ రైతు అవుట్ లెట్లు ఏర్పాటు చేసి ఇక్కడ ఆర్గానిక్ గా పండే చిరు ధాన్యాలను అమ్మటం ద్వారా గిరి రైతులు లబ్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంయుక్త కలక్టర్ జే. శివ శ్రీనివాసు మాట్లాడుతూ, రానున్న కాలంలో చిరుదాన్యాలకే అధిక ప్రాదాన్యమున్నందున, గిరిజనులు చిరు ధాన్యాల సాగును విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ కలక్టర్ వి. అభిషేక్, జిల్లా వ్యవసాయాదికారి బిఎన్ఎస్ నంద్, డిఆర్డిఎ పిడి మురళి తదితరులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ డి ఎం రవి తేజ, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిహెచ్. దేవి, 22 మండలాల సమాఖ్య అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జీ-20 ప్రతినిధులను ఆకట్టుకునేలా నగర సుందరీకరణ పనులు

క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్లు, కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో ఈ నెల 28, 29 తేదీలలో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న జీ-20 సదస్సు కార్యక్రమానికి దేశవిదేశాల నుండి విశాఖ నగరానికి విచ్చేస్తున్న ప్రతినిధులను, అతిధులను ఆకట్టుకునేలా విశాఖ నగరాన్ని సుందరీకరణ పనులతో జీవిఎంసి తీర్చిదిద్దుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శుక్రవారం ఆమె డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, జీవిఎంసి కమీషనర్ పి. రాజాబాబు, ఇతర జీవిఎంసి అధికారులతో కలిసి జీ20 సదస్సుకు సంబంధించి విశాఖ నగరంలో విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుండి రాడిసన్ బ్లూ హోటల్ వరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను పరిశీలిస్తూ పర్యటించారు. అనంతరం ఎన్ఏడి కొత్తరోడ్ వద్ద సుందరీకరణ పనులను పరిశీలించారు. ఆర్&బి జంక్షన్ వద్ద మాధవధార వాటర్ పంప్‌హౌస్ ను పరిశీలించారు. ఈ పంప్‌హౌస్ ను పరిశీలించేందుకు జి-20 సదస్సుకు విచ్చేసిన ప్రతినిధులకు. నగరంలో జీ-20 సదస్సు జరుగుతున్నందుకు చిహ్నంగా 20 దేశాల జెండాలతో నిర్మిస్తున్న జీ-20 పైలాన్ నిర్మాణ పనులను ఆమె పరిశీలిం చారు. జరుగబోతున్న జీ-20 సదస్సు నందు ఎటువంటి లోపాలు లేకుండా, సంపూర్ణ సమచారంతో ఈ విశాఖ నగరం అతిధులను ఆకట్టుకునేలా ఈ సదస్సు నిర్వహణ ఏర్పాట్లను సూక్ష్మంగా పరిశీలించే చర్యలు చేపట్టాలని మేయర్ కమీషనర్ కు సూచించారు. పర్యటనలో ప్రధాన ఇంజనీర్ రవికృష్ణ రాజు, అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాస రావు, డాక్టర్ వి. సన్యాసి రావు, పర్యవేక్షక ఇంజినీర్లు వేణు గోపాల్, సత్యనారాయణ రాజు, శాంసన్ రాజు, జోనల్ కమీషనర్ లు నీర్లు, తదితరులు పాల్గొన్నారు.

28న దిల్లీలో జరిగే స్కీమ్ వర్కర్ల మహాధర్నా జయప్రదం చేయాలి : కోన. లక్ష్మణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఈనెల 28న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట జరగబోయే స్కీమ్ వర్కర్ల మహాధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు, అనకా పల్లి జిల్లా కన్వీనర్ కోన. లక్ష్మణ పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో లక్ష్మణ మాట్లాడుతూ. స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని లక్ష్మణ విమర్శించారు. స్కీమ్ వర్కర్ల సమస్యలపై కొంతకాలంగా ఆందోళనలో చేస్తున్నామని, అయినా వారికి బడ్జెట్లో కేటాయింపులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గణనీయంగా తగ్గించాయన్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చా లని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, సమావేశంలో బందారు. వెంకటేష్, పిన్నింటి. రాజు, సి. హెచ్. నాయుడు, వి. హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: హుకుంపేట మండలంలోని వీఆర్వోగా విధులు చేపడుతున్న శెట్టి సుబ్బారావు కుమారుడు శెట్టి ప్రవీణ్‌కుమార్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీమంత్రి కిడారి. శ్రావణ్ కుమార్ శుక్రవారం దుంబ్రిగుడ కేంద్రాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. మృతుడు శెట్టి ప్రవీణ్ కుమార్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యాపరంగా ఉన్నత చదువులు అధిరోహించిన ప్రవీణ్‌కుమార్ మృతి చెందడం బాధాకరం అన్నారు. అలాగే ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి గంగాధర స్వామి, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు దుంబ్రిగుడ కేంద్రాన్ని సందర్శించి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు : కలెక్టర్

విశాలాంధ్ర-కే కోటపాదు: జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అనకాపల్లి కలెక్టర్ రవిసుభాష్ పట్టన్‌శెట్టి అన్నారు. శుక్రవారం ఈ మండలం పాతవలస, సూదివలస గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ లకు గురవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడమే కాక ఆక్రమణదారులపై పోలీస్ కేసులు నమోదు చేస్తామని అన్నారు. పాతవలస హై స్కూల్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని హై స్కూల్ హెచ్ఎం ను ఆదేశించారు. నాడు నేడు లో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రంలో ఉన్న రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన తుఫాను వల్ల మామిడి, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. కూరగాయలు నిల్వచేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని కోరగా రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా తీర్మానం చేసి తనకు పంపాలని ఉద్యానవన శాఖ సహాయకురాలు గజ్జి అనూషను ఆదేశించారు. అనంతరం సూదివలసలో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయ భవనాన్ని పరిశీలించారు. సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని ఎటువంటి వివాదాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. రైతులందరి సమక్షంలో భూ సర్వే నిర్వహించాలని తాసిల్దార్ రమేష్ బాబును ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శచిదేవి, ఏవో సోమశేఖర్, ఎంఈఓ మధుమూర్తి, ఐసిడిఎస్ ఏపీవో మంగతాయారు, ఎంపీటీసీ వర్రీ రామనాయుడు, సర్పంచులు జామి శ్రవణ్, ఆదిరెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులు పరిశీలన

విశాలాంధ్ర-ఆనందపురం: మండలంలో కణమాం గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న తీరును కేంద్ర ప్రభుత్వం పరిశీలకులు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ కంట్రోలర్ ఆఫ్ ఆడిట్ జనరల్ ఎం. రేణుక ఆడిట్ కన్సల్టెంట్ బాటియా లు ఆనందపురం మండలం కణమాం గ్రామపంచాయతీ లో 2018 నుండి 2021 వరకు జరిగిన పనులలో 14 పనులను ఎంపిక చేసుకొని అందులో 2 పనులను క్షేత్ర స్థాయిలో ప్రతి రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల పనిని కొండలపై త్రవ్విన ట్రెంచ్ పనులను పరిశీలించి సంబంధిత రికార్డ్స్ లను తనిఖీ చేయటం జరిగినది , కేంద్ర ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించాలని అది అందరి బాధ్యతని,సంబంధిత కూలీలు, మెట్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

గొన్న కళాశాలలో క్యాంపస్ డ్రైవ్: 10మంది ఎంపిక

విశాలాంధ్ర-పరవాడ: గొన్న కళాశాల లో శుక్రవారం ఐసీఐసీఐ బ్యాంక్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. ఈ క్యాంపస్ డ్రైవ్ ఇంటర్వ్యూలలో 40 మంది ఎంబిఏ విద్యార్థులు పాల్గొనగా అందులో 10 మందిని బ్యాంక్ ప్రతినిదులు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ గొన్న హేమచంద్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకొని వారి జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలని పిలుపునిచ్చారు. కళాశాల విద్యార్థులందరికీ మెరుగైనస్థాయిలో ఉద్యోగాలు వచ్చేలా కళాశాల యాజమాన్యం ప్రయత్నిస్తుందని తెలిపారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.బి ఓం నమశ్శివాయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పివిఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఫార్మేషన్ డే సందర్భంగా జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఫార్మేషన్ డే సందర్భంగా వియస్‌పి ఓబిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లైజినింగ్ ఆఫీసర్, జనరల్ మేనేజర్ జి.అప్పారావు, ఓబిసి ఆఫీస్ ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ చేశారు. అధ్యక్షులు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి యస్.శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వైయల్ నాయుడు, కోశాధికారి ఉండవల్లి శ్రీనివాసరావు, అడిషనల్ జనరల్ సెక్రెటరీ ఆర్‌వి నారాయణ, సీనియర్ ఓబిసి నాయకులు జీఆర్‌కె నాయుడు, కామేశ్వరరావు, పి చంద్రరావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు గెద్దాడ అప్పలరాజు, ఎం ఎన్ ప్రసాద్ శంకర్రావు కొణతాల రామకృష్ణ, ఇ శేషగిరి, యస్ అచ్యుత రావు, నేలపాటి రాజు, పల్లా పెంటారావు కారి దేవుడు, పోలారావ్, డి ఈశ్వర్‌రావు, జి అప్పలనాయుడు, వంగపండు సింహాచలం, డి సత్యనారాయణ, ఆర్ సత్యనారాయణ,యస్ గౌరీ శంకరరావు,మరియు సీనియర్ నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్,బి గంగాధర్ అనంతరము యల్ & డిసి వద్ద సీనియర్ ఓ బి సీ నాయకులు జి ఆర్ కె నాయుడు జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో సన్నిబాబు, చిత్రాడ సన్యాసిరావు, ఉమామహేశ్వరరావు, డిప్యూటి జనరల్ సెక్రటరీ కోయిలాడ శ్రీనివాసరావు, పి గోవింద, రమణమూర్తి, జిబి సత్యనారాయణ, డి రాజా,కాసా రమణ మూర్తి, చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పన్నపాలెం జేఎన్ఆర్ఎమ్ కాలనీలో కిలాని శ్రీదేవి(24) వివాహిత శుక్రవారం అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలిని ఆమె భర్త శివ తీవ్రంగా కొట్టడంతో మృతి చెందిందని బంధువులు ఆరోపిస్తున్నారు. శ్రీదేవికి జీవీఎంసీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శివతో పెళ్లి జరిగి ఏడు సంవత్సరాలు అవుతుంది. వీరికి 6సంవత్సరాల అబ్బాయి, 4 నాలుగు సంవత్సరాల పాప ఉన్నారు. మృతురాల శ్రీదేవి బంధువులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించినట్లు చెప్పారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

సిపిఐ ప్రతినిధి బృందం విజ్ఞప్తి

విశాలాంధ్ర-విశాఖ: విశాఖ నగరంలోని కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో రామజోగిపేటలోని భారతి హాస్పిటల్ వెనుక ఉన్న పాత భవనం బుధవారం రాత్రి కూలిపోవడంతో ఒకే కుటుంబానికి చెందిన సాకేటి అంజలి(15), సాకేటి దుర్గా ప్రసాద్(17), బీహార్ కు చెందిన రమల్లా సాహు(28, చోటూ) మృతిచెందారని, వీరి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విశాఖ జిల్లా కలెక్టర్ ని కోరుతూ డిఆర్ఓ శ్రీనివాస్ కి సిపిఐ ప్రతినిధి బృందం శుక్రవారం వినతిపత్రం అందజేసింది. వీరి తల్లి సాకేటి కళ్యాణి పరిస్థితి విషమంగా ఉందని, తండ్రి సాకిరి రామ తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొంది. వీరితో పాటు సన్నాపు కృష్ణ, అతని భార్య రోజురాణి సహా మొత్తం నలుగురు తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని తెలిపింది. వీరందరు రోజువారీ కూలి పనులు చేసుకొని జీవనం సాగించే పేదవారని తెలిపింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారికి కూడా తగిన ఆర్థిక సహాయం అందించవలసినదిగా విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ కె రెహమాన్, పి చంద్రశేఖర్, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరికల బోర్డులు తొలగించి భూ-ఆక్రమణ!

విశాలాంధ్ర- అచ్యుతాపురం: ప్రభుత్వ భూముల్లో హెచ్చరికల బోర్డులు తొలగించి మరీ ఆక్రమణలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు బలంగా ఇక్కడ వినిపిస్తున్నాయి. కొండకర్ల గెస్ట్‌హౌస్ నుండి బంగారయ్యపాలెం వెళ్లె రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టినప్పటికీ, దానిని తొలగించి అక్రమ లే-అవుట్ వేస్తున్నారు. భూముల ధరలు అమాంతంగా కోట్లల్లో పలకడంతో భూకబ్జారాయుళ్ల ప్రభుత్వ ఆస్థులను ఆక్రమించు కుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దర్జాగా లే-అవుట్లు వేసి విక్రయించుకుంటున్నా పట్టించుకునే నాధుడే కరవయ్యాడని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గెడ్డలు, చెరువులు, కొండలు, అడవులు సైతం ఆక్ర మించుకోవడంతో భవిష్యత్తులో గ్రామాలు నీటమునిగే పరిస్థితి ఏర్పడు తుందని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికా రులు త్వరతగతిన స్పందించి ప్రభుత్వ ఆస్థులను కాపాడి, ఆక్రమనకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

చదువు ద్వారానే గౌరవం

విశాలాంధ్ర-నాతవరం: సమాజంలో చదువు ద్వారా మాత్రమే గుర్తింపు, గౌరవం వస్తుందని అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. శుక్రవారం నాతవరం మండలం కేంద్రంలో గల ఎస్సీ బాలుర వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. భవిష్యత్తులో విపరీతమైన కాంపిటేషన్ ఉన్నందున చదువుపై అధిక శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వసతి గృహ సంక్షేమ అధికారి శివ, మాజీ జడ్పిటిసి చిట్ల చలపతిరావు, దళిత సంఘాల ప్రతినిధులు చెక్కా జోగిరాజు, యాదగిరి దాసు, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ను దర్శించుకున్న జస్టిస్ నాగార్జున రెడ్డి

విశాలాంధ్ర-గోపాల పట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారిని జస్టిస్ నాగార్జున రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు వేదమంత్రాలతో నాదస్వరములతో ఘన స్వాగతం పలికారు. వీరు తొలుత కప్ప స్తంభం ఆలింగనం అనంతరము స్వామివారి దర్శనము తదుపరి వేద పండితులచే వేద ఆశీర్వచనము చేసి స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను ఆలయ సూపింటెండెంట్ జి. అప్పల నాయుడు అందజేశారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి : కార్మిక సంఘాల నేతలు...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రామజోగి పేట 29వ వార్డులో మూడంతస్తుల భవనం కూలిన ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక సాయం ప్రకటించలేదని, అధికార పార్టీలో ఉన్న ఏ ఒక్క నాయకుడు రాలేదని, ఇంటి ఓనర్ ని ఇంతవరకు కస్టడీలోకి తీసుకోలేదన్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులకు అండగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జనసేన పార్టీ మెరక ముడిదాం మండల అధ్యక్షులు రౌతు కృష్ణవేణి నాయుడు, సిఐటియు నాయకులు ఎం సుబ్బారావు అండగా ఉండి విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తూ కలెక్టర్ కి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. స్పందించిన కలెక్టర్ మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బీహార్, విజయనగరం జిల్లా మెరకముడదాం స్వగ్రామం తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు చట్టపరంగా న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలియజేశారు.

అత్యంత సుందరంగా కోనేరు గట్టు

విశాలాంధ్ర-పద్మనాభం: మండలంలో శుక్రవారం స్థానిక ఎంపీపీ కే రాంబాబు, స్థానిక నాయకులు కలసి అనంత పద్మనాభ స్వామి కోనేరు అనగా కన్నయ్య కోనేరు గట్టు చుట్టూ కొబ్బరి మొక్కలు వేయడం జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ కే రాంబాబు మాట్లాడుతూ అనంత పద్మనాభ స్వామి వారి తేప్పోత్సవం కార్యక్రమం గత సుమారు 70 ఏళ్ల తర్వాత ఈ సంవత్సరమే నిర్వహించడం జరిగిందని అది ఈ కోనేరులో నిర్వహించడం జరిగిందని ఈ సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేస్తామని అన్నారు కోనేరు గట్టును అత్యంత సుందరంగా తయారు చేస్తామని అన్నారు ఈ యొక్క కార్యక్రమానికి స్థానికులు స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరైనారు.

పద్మ శ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రశేఖర్ కు ఘన సత్కారం

విశాలాంధ్ర-పాయకరావుపేట రూరల్: పద్మశ్రీ అవార్డు అందుకున్న శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకుడు, సంఘ సేవకుడు, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ కు పాయకరావుపేటలో ఘన స్వాగతం, ఘన సన్మానం లభించింది. ఈనెల 22న రాష్ట్రపతి చేతుల మీదగా పద్మశ్రీ అవార్డు అందుకుని విశాఖపట్నం విమానాశ్రయం నుంచి కాకినాడ వెళ్తున్న డా.చంద్రశేఖర్ ను పాయకరావుపేట వై జంక్షన్ వద్ద గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బిజెపి నాయకుడు తోట నగేష్, జనసేన సీనియర్ నాయకులు గెద్దం బుజ్జి సాదర స్వాగతం పలికారు. పద్మ శ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తోట నగేష్, గెద్దం బుజ్జి ఆయనకు పూలమాలలు వేసి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తోట నగేష్ మాట్లాడుతూ కిరణ్ కంటి ఆసుపత్రి స్థాపించి రెండు లక్షల 50 వేలు మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించినందుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించి పద్మశ్రీ అవార్డు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జగతా శ్రీను, కంభంపాటి రమణ, జి.వి.వి. సత్యనారాయణ, పల్యాల లచ్చబాబు, ఇంజరపు సూరిబాబు, దేవాది మంగాదేవి, పెంకె గోవిందు, కర్రీ శ్రీను, వేముల రమణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వేములవలస మార్కెట్ వేలం

విశాలాంధ్ర-ఆనందపురం : ఒక కోటి 67 లక్షలు వేములవలస గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ రోజువారి మార్కెట్ వేలంపాట ఒక కోటి 67 లక్షలకు ఇచ్చుపాట దారులు దక్కించుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి జి అప్పలరాజు, విస్తరణ అధికారి పీవీఎన్ జే. ఆంజనేయులు గ్రామ కార్యదర్శి పి నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ వేలంపాట సీల్డ్ కవర్ , బహిరంగ వేలంపాట నిర్వహించారు ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు సీల్డ్ కవర్లను సేకరించారు.మూడు సీల్డ్ కవర్లో టెండర్లు వేయగా పంచాయతీ అధికారులు స్వీకరించారు అనంతరం బహిరంగ వేలం పాట నిర్వహించారు అనంతరం సీల్డ్ కవర్లు ఓపెన్ చేసి గా వేములవలస గ్రామానికి చెందిన పతివాడ పుష్పవతి అత్యధికంగా 1,66,99,999 రూపాయలకు హెచ్చుపాటదారులుగా ఖరారు చేశారు. గత ఏడాది 1,26,18,999 రూపాయలు కాగా ఈ ఏడాది అత్యధికంగా ఖరారు అయింది. ఈ పాట సంవత్సరం పాటు అమలులో ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లంక కొండమ్మ పంచాయతీ వార్డ్ నెంబర్లు వేలం పోటిదారులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం

విశాలాంధ్ర-నక్కపల్లి: హెటరో మందుల కంపెనీ పైపులైనుకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమర యోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖదేవ్ ల పోరాట స్ఫూర్తితో. పోరాడుతామని తెలిపారు,భగత్ సింగ్ 92 వ వర్ధంతి సందర్భంగా మత్స్యకారులు మహా శాంతియుత ధర్నా 476 వరోజు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ అప్పుడు కుల, మత, ప్రాంతాలకు అతీతంగా భారతీయులు అంతా స్వాతంత్ర్యం కోసం ఎలా వీరోచితంగా పోరాడారో నేడు మత్స్యకారులు కూడా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాడి ఉపాధి, ని పర్యావరణాన్ని ఈ ప్రాంతాన్ని కాపాడాలని కోరారు,. భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రాణాలైనా త్యాగం చేద్దాం ఎట్టి పరిస్థితుల్లోనూ పైపులైను వేయడానికి అంగీకరించే ప్రసక్తే లేదని తెలిపారు ఈరోజు కార్యక్రమంలో వాసుపల్లి సూకరాజు,గోసల సోమేశ్వరరావు, మైలపల్లిజాన్, వాసు పిల్లి అప్పారావు,గోసల కాశీ,మైలపల్లి బాపూజీ పాల్గొన్నారు.

పోషన్ పక్వాడ మిషన్ కార్యక్రమం

విశాలాంధ్ర-చీడికాడ : మండలంలోని దిబ్బపాలెం బైలుపూడి సచివాలయ పరిధిలో ఐసిడిఎస్ పిఓ సిహెచ్ శ్రీదేవి ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ మిషన్ 12 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు బాలింతలు తల్లులకు పిల్లలకు చిరుధాన్యాల వినియోగం వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు ఈకార్యక్రమంలో పెదగోగాడ సెక్టార్ సూపర్వైజర్ వి ఈశ్వరమ్మ తదితరులు పాల్గున్నారు.

ఇంటర్ పరీక్షలను తనిఖీ చేసిన ఐటిడిఏ పిఓ

విశాలాంధ్ర-పాడేరు: స్థానిక ఎపి ఆర్ జే సి సెంటరులో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలను ఐటిడి ఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసారు. అన్ని గదుల పర్యటించి విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఇన్విజిలేటర్లను, డిపార్టుమెంటు అధికారులను చీఫ్ సూపరిండెంట్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాడేరు తాహశీల్దార్ వి.త్రినాధరావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

విశాలాంధ్ర-యలమంచిలి రూరల్: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన నువ్వుల పంటను శుక్రవారంనాడు వ్యవసాయ సంచాలకులు రవి ప్రకాష్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లా డుతూ నీట మునిగిన పంట పాడవ్వకుండా ఉండేందుకు నీటిని తీసి,ఎకరాకు 18 కేజీలు యూరియా వేయాలన్నారు.అలాగే గింజ దశలో ఉన్న పంటకు 5గ్రాముల పోటాష్ తో పిచికారీ చేయడం ద్వారా పంటను రక్షించుకోవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో వి హెచ్ ఏ స్వాతి,లలిత, ఎ ఈ ఓ దేముడు ఉన్నారు.

విద్యార్థినులకు అభినందన

విశాలాంధ్ర-మల్కాపురం: జి-20 దేశాల సదస్సును 2023లో భారత దేశంలో నిర్వహించనున్న నేపథ్యంలో అనేక రకాల విజ్ఞానదాయకమైన కార్యక్రమాలను భారత ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా 75 వర్సిటీలలో అనేక రకాల పోటీలను, సదస్సులను నిర్వహిస్తోంది. ఈ 75 వర్సిటీలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటి కావడం విశేషం. ఈనెల 20 మరియు 21 తేదీలలో అనేక రకాల పోటీలను ఆంధ్ర విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల విద్యార్థులకు, ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులకు నిర్వహించింది. ఆ విజేతలకు శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొని, పలువురు ప్రశంసలు పొందిన సెయింట్ ఆన్స్ విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి అభినందించారు. అదే విధంగా వ్యాసరచనలో బహుమతి పొందిన హర్షిత రాణి ని ప్రత్యేకంగా ప్రశంసించారు.

విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ

పత్రికా ప్రకటన

VMRDA-LAYOUT/APDPMS No. 1093/0007/LP/VZM/2021, తేది. 21-03-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునదేమనగా శ్రీ పి.బాలాజి మరియు ఇతరులు, మరియు వారి డెవలపమెంట్ అగ్రిమెంట్ కపుల్డ్ విత్ ఇర్రెవోకబుల్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్స్ శ్రీ టి.కిషన్ కుమార్ మరియు ఇతరులు, విజయనగరం, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, లంకపట్నం గ్రామం నందలి సర్వే సంఖ్య 3(P) లో మొత్తం ఎకరములు 4.0231 సెంట్లు గల భూమిని లే అవుట్ అనుమతి నిమిత్తం దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం ఆన్‌లైన్ ఫైల్ ఆర్.సి. నెం.VMRDA-LAYOUT/APDPMS No. 1093/0007/LP/VZM/2021నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లే అవుట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

క్షయ నివారణపై గీతం నర్సింగ్ విద్యార్థుల ర్యాలీ

విశాలాంధ్ర-మధురవాడ: ప్రపంచ క్షయనివారణ (ప్రపంచ టిబి దినం) దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ నర్సింగ్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ విద్యార్థులు క్షయ వ్యాధి నివారణపై నిర్వహించిన అవగాహన ర్యాలీని గీతం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన వ్యాధులలో టిబి ఒకటని, దీని కారణంగా ఏటా 1.6 మిలియన్ల జనాభా మరణి స్తున్నారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 సంవత్సరం నాటికి టిబిని పూర్తిగా అరికట్టాలన్న లక్ష్యంతో ప్రపంచ దేశాలకు దిశ నిర్దేశం చేసిందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు టిబి వ్యాప్తి పట్ల అవగాహన కలిగి ఉండా లని, నివారణకు కృషి చేయాలని సూచించారు. టిబి వ్యాప్తిని అరికట్టడానికి వ్యాధినిరోధక శక్తిని పెంచుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాల న్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ టి.మాలతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు టిబి నివారణకు సంబంధించిన నినాదాలను ప్రదర్శించారు.

వైభవంగా రామాలయం ప్రారంభం

విశాలాంధ్ర-యస్. రాయవరం : మండలంలో గుడివాడ పంచాయతీ పరిధిలోని కొత్త పోలవరం గ్రామంలో నూతనంగా పున నిర్మాణం చేసిన రామాలయం ను వైభవంగా ప్రారంభించారు. గత రెండు రోజులుగా పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయం ప్రారంభంతో పాటు విగ్రహాలు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా కోశాధికారి బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీపీ శారదాకుమారి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి,వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, సర్పంచులు దూళి శ్రీను,కర్రి సత్యనారాయణ, పాలపర్తి పాపారావు,నిర్వాహకులు వెంకటరాజు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన వస్తువుల పంపిణీ

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గల గిరిజన వర్తకుల సంఘ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల 2లో పదవ తరగతి విద్యార్థినులకు పరీక్షలకు అవసరమైన అటలు,పెన్నులు, ఉపాధ్యాయులకు పెన్నులు పంపిణీ చేసిన గిరిజన మండల వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు సోనియా ప్రసన్నకుమార్ బోర్గం పూర్ణారావు ఉపాధ్యక్షులు కాంతారావు మోహన్ రావు ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ చైతుల మీద శుక్రవారం పంపిణీ చేశారు,గిరిజన మండల వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శుల సొంత నిధులు వెచ్చించి 23 మంది విద్యార్థిని లకు అట్టలు,ఒక్కొక్క విద్యార్థికి రెండేసి పెన్నులు,పంపిణీ చేశారు. అనంతరం రాధాకృష్ణ మాస్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థినులకు అట్టలు పెన్నులు పంపిణీ చేయడం సంతోషకరమని విద్యార్థుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు, కార్యక్రమంలో కార్యక్రమంలో మండల గిరిజన వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ

కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, విజయనగరం

టెండర్ నోటీసు నెం.	పనిపేరు	కాంట్రాక్టు విలువ
01/2023-24, తేది. 23.03.2023	ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధిసంస్థ, విశాఖపట్నం సర్కిల్ ఆఫీసు భవనం యొక్క మొదటి అంతస్తు సివిల్, ఎలక్ట్రిక్ వైరింగ్ మరమ్మత్తులు మరియు పెయింటింగ్ పనులు చేయుట.	రూ. 3,25,743.00

'ఇ' ప్రొక్యూర్మెంట్ వెబ్‌సైట్ నుండి టెండర్ షెడ్యూల్స్ తీసుకోవలసిన తేది : 23.03.2023 ఉ॥ 11.00 గం॥ల నుండి : 29.03.2023 మ॥ 3.00 గం॥ల వరకు
ఆన్‌లైన్ ద్వారా టెండరు స్వీకరించు చివరి తేది : 29.03.2023 మ॥ 3.30 గం॥ల వరకు
టెండర్ ఆహ్వానించు అధికారి : కార్యనిర్వాహక ఇంజనీరు
ఫోన్ నెం. : 9100180067

మిగిలిన వివరముల కొరకు www.apeprocurement.gov.in నందు లేదా సహాయక కార్యనిర్వాహక ఇంజనీరు, ఎ.పి.యస్.ఐ.డి.సి. ప్రాజెక్టు ఆఫీసు, విజయనగరం వారిని సంప్రదించగలరు. ఫోన్ నెం. 9550805224

జి-20 సదస్సుకు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి

నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: జి-20 సదస్సుకు అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం గావించాలని నగర పోలీసు కమీషనర్ శ్రీకాంత్ సూచించారు. నగరంలో ఈ నెల 28, 29, 30 తేదీలలో జి-20 సదస్సు నిర్వహించనున్న సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఎ.యస్.ఎల్. లో భాగంగా రాడిసన్ బ్లూ హెూటల్లో సదస్సు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 28, 29, 30 తేదీలలో నిర్వహించబోయే జి-20 సదస్సు దేశానికి, రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహించాలన్నారు. వివిధ దేశాల నుండి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో స్వాగత ఏర్పాట్లు, లైజన్ ఆఫీసర్లు, తదితర ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. అతిథులు సందర్శించే రోజుల్లో పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు ప్రవేశం ఉండదన్నారు. సదస్సుకు వచ్చే అతిథులకు సాంప్రదాయ పద్ధతులలో స్వాగత ఏర్పాట్లు చేస్తామని జివిఎంసి కమిషనర్ పి. రాజబాబు వివరించారు. హెూటల్ వద్ద పార్కింగ్, సదస్సుకు వచ్చే అతిథులు రిజిస్ట్రేషన్ కౌంటర్, వసతి, తదితర విషయాలపై నగర పోలీసు కమిషనర్ జివిఎంసి కమిషనర్ పి. రాజబాబు, జెసి కెయస్ విశ్వనాథన్, డిసిపి సుమిత్ సునీల్ గరుడ్ లతో చర్చించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్థలం, స్టాల్స్ ఏర్పాటుకు పలు సూచనలను పోలీసు కమిషనర్ శ్రీకాంత్ జారీ చేశారు. బీచ్ ఫ్రంట్ ను పరిశీలించి అతిథులకు సిటింగ్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెయస్ విశ్వనాథన్, డిసిపి సుమిత్ సునీల్ గరుడ్, ఆర్డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, జోనల్ కమీషనర్, పలువురు పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాపులుప్పాడ వద్ద ఎనర్జీ ప్లాంట్, ముడసర్లోవలోని ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్, మాదవధారలోని వాటర్ సస్టైనబుల్ ప్రాజెక్టులను సందర్శించారు.

కించమండ లో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: మండలం లోని కించుమండ పంచాయతీ కేంద్రంలోని శుక్రవారం ఆ పంచాయతీ సర్పంచ్ హరిబారికి చెల్లమ్మ పారిశుధ్య నిర్మూలనపై ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని వీధి కాలువల చుట్టుపక్కలు పేరుకుపోయి ఉన్న చెత్త వ్యర్థాలను తొలగిస్తూ పారిశుధ్య నిర్మూలనపై దృష్టి కేంద్రీకరించారు. గ్రామంలోని పేరుకుపోయి ఉన్న వ్యర్థాలను తొలగింపు చర్యలు చేపట్టిన సర్పంచ్ దృష్టి కేంద్రీకరణ పై గ్రామ ప్రజలు అభినందించారు.

31న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-హుకుంపేట: ఈ నెల 31వ తేదిన శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని స్థానిక ఎంపీడీవో వెంకటరావు ఒక ప్రకటనతో పేర్కొన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం మందిరంలో నిర్వహించే సమావేశానికి మండల స్థాయి అధికారులు, దాదాపుగా 28 శాఖల అధికారులు హజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులు మండలంలో వారి పనితీరుపై సమీక్ష ఉంటుందని తెలిపారు. అలాగే మండలంలో నాయకులు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు. 31వ తేది ఉదయం 10.30 నిమిషాలకు సమావేశం ప్రారంభిస్తామని అందురు విధిగా హాజరు కావాలని కోరారు. మండల స్థాయిలో ఏఅధికారి రాకపోయిన వారిపై కలెక్టర్ కు పిర్యాధు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి : ఎంఈఓ రామచంద్రరావు

విశాలాంధ్ర-దుంబ్రిగూడ: ఉపాధ్యాయులు విధులపట్ల అంకిత భావంతో పనిచేస్తూ విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి వారి ఉన్నత చదువుల అధిరోహణకు తోడ్పాటు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎస్ రామ చంద్రరావు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని కొర్రా, మామిడివలస, సంఘంవలస, బుడమల పుట్టు పాఠశాలలను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంతో పాటు రాగి జావ వారానికి మూడు రోజులు విద్యార్థులకు అందించాలని, అదేవిధంగా ఆయాలు టాయిలెట్స్ నిర్వహణలో ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుండి 2 గంటల వరకు పాఠశాలలో ఉండి పనిచేయాలని ఆయన తెలిపారు. అంతకు ముందు తూటంగి పంచాయతీ దాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వి.ఎస్.అర్జున్ మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగ్రామం మండిపుట్టు వెళ్లి వారి కుటుంబాన్ని కలసి దహన సంస్కారాల కింద ఖర్చులిచ్చి వారికి సహాయ సహకారాలు అందిస్తానని ఎంఇఓ హామీ ఇచ్చారు..

గ్రూప్-1మెయిన్ పరీక్షకు 3నెలలు గడువు పెంచాలి : టీఎన్ఎస్ఎఫ్

విశాలాంధ్ర-హుకుంపేట: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సిద్దం అవు తున్న అభ్యర్థులకు 85 రోజులు సరిపోదని ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు 3నెలల సమయం కావాలని అరకు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షు డు తామర్ల సత్యనారయణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల కోసం ఇచ్చిన 85 రోజుల సమయం చాలదని, మరో 3 నెలల అదనపు సమయం ఇవ్వాలని అదే విధంగా గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులు ప్రిపరేషన్ కోసం కేవలం 85 రోజులే ఇచ్చారని, ఏడు పేపర్లు ప్రిపేర్ కావడానికి ఈ సమయం చాలదని తక్షణమే ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు 3నెలల గడువు పొడిగించాలని వారు కోరారు. మెయిన్స్ పరీక్షకు అన్ని అంశాలలో అవసరమైన లోతైన జ్ఞానం,లోతైన విశ్లేషణ చేసేందుకు ఈ మూడు నెలల సమయం సరిపోదని మెయిన్స్ పరీక్షకు మరో మూడు నెలల అదనపు సమయం పొడిగించాలని కొత్తవారితోపాటు, ఉద్యోగాలు చేసుకుని గ్రూప్-1 రాసేవారికి ఈ అదనపు సమయం ప్రిపేర్ కావడా నికి ఎంతో ఉపయోగపడు తుందని ఆయన అన్నారు. ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు గ్రహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ ఎస్ ఎఫ్ విద్యార్థి విభాగం నాయకులు అగతంబిడి ఆనందరావు,జర్సింగి నాని,గంగాధర్,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపాకు కొనసాగుతున్న కౌంట్ డౌన్

ఎమ్మెల్సీల ఓటమితో వైకాపాలో ప్రారంభమైన అంతర్మధనం

టీడీపీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర-చింతపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల నుంచి వైకాపాకు కౌంట్ డౌన్ ప్రారంభమైందని, అదే నేడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా కొనసాగిందని తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 175 స్థానాలకు 175 స్థానాలు కైవసం చేసుకుంటామన్న వైకాపా ఆశలపై ఆదిలోనే పట్టబద్రులు నీళ్లు చల్లారన్నారు. ఉత్తరాంధ్రతోపాటు పోటీ చేసిన మిగిలిన తూర్పు, పశ్చిమ రాయలసీమల స్థానాల్లోనూ తెదేపా విజయ దుందుభి మ్రోగించడం వైకాపాకు పట్టబద్రులు ఇచ్చిన షాక్ ట్రీట్మెంట్ అన్నారు. అదే క్రమంలో ఎమ్మెల్యే కోటాలోను ఎమ్మెల్సీ ని తెదేపా కైవసం చేసుకోవడం ఆ పార్టీని సొంత శాసనసభ్యులు సైతం నమ్మలేదు అన దానికి నిదర్శనం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అటు పట్టభద్రులు, ఇటు ఎమ్మెల్యేలు ఇచ్చిన తీర్పు వైకాపాకు చెంపపెట్టు అని ఆయన జోస్యం చెప్పారు. ఇప్పటికైనా వైకాపా ప్రభుత్వం కళ్ళు తెరచి ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరించాలని ఆయన హితవు పలికారు.

పది విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్'.. ఎంపిపి శ్రీదేవి

విశాలాంధ్ర-దేవీపట్నం: పదవ తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థినీ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పే కార్యక్రమానికి రంపచోడవరం ఎంపిపి బంధం శ్రీదేవి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఇష్టా గోష్టి గా మాట్లాడుతూ పలు సూచనలు సలహాలు ఇచ్చారు పరీక్షలు పట్ల భయాందోళనలు వీడాలన్నారు మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్నులు ప్లాంక్ లు విద్యార్థినీలకు పౌచ్ లను తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అదేవిధంగా చదువుకున్న పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ శ్రీమతి పండా కుమారి ఎంపీటీసీలు వంశీ కుంజం ముచ్చిక సాయిబాబు దొర శ్రీమతి బచ్చల మంగమ్మ మ్వర్ కుమార్ బాబు మెమో కారం సత్యనారాయణదొర , స్థానిక వైఎస్సార్సీపి నాయకులు బొబ్బా శేఖర్ లు హాజరయ్యారు.

పోషణ పక్షోత్సవాలపై విద్యార్థులకు అవగాహన



విశాలాంధ్ర-చోడవరం: మండలం లోని దామునాపల్లి, మైచర్లపాలెం గ్రామాల్లో సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం రావికమతం ప్రాజెక్టు అంగన్వాడి సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దామునాపల్లిలో సర్పంచ్ బలిరెడ్డి వసుంధర నాగేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలు మంచి ఆరోగ్యం గా ఉండాలని పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. గర్భిణీ స్త్రీలు ,పిల్లలు, బాలింతలు, పోషక విలువలతో కూడిన పదార్థాలు తిని ఆరోగ్యంగా ఉండాలని, సీఎం అందరి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం చాలా సంతోషం అన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అంగన్వాడీ కార్యకర్త ఆర్. కామరాజు, తదితర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ టారిఫ్ పై ఏపిఈఆర్ సీ ఉత్తర్వులు విడుదల....

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల ఉత్తర్వులను రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఈఆర్ సీ) చైర్మన్ జస్టిన్ సి.వి.నాగార్జునరెడ్డి ఈనెల 25న విడుదల చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖపట్నంలో గల సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఎటిసి భవన కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 25వ తేదీన (శనివారం) ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఈఆర్ సి సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, పి.రాజగోపాల్ రెడ్డిలతోపాటు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు కె.సంతోషరావు (ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్), జె.పద్మాజనార్ధన్ రెడ్డి (ఏపీసీపీడీసీఎల్) పాల్గొంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పెప్సీతో రైజ్ అప్ సూపర్స్టార్ యష్ నూతన ప్రచారం

విశాలాంధ్ర -విశాఖ సిటీ : ప్రముఖ శీతల పానీయం పెప్సీ తమ 125వ వార్షికోత్సవాన్ని తమ పూర్తి సరికొత్త ప్రచారం 'రైజ్ అప్ బేబీ !' తో వేడుక చేస్తూనే ఈ వేసవిలో మరో ప్రచారాన్ని రాకింగ్స్టార్ యశ్తో రూపొందించింది. పెప్సీ స్ఫూర్తికి నివాళిగా, సామాజిక ధృవీకరణ కోరుకోకుండా తమకు నచ్చినట్లుగా ఉండే భారతదేశంలోని యువతకు సాధికారిత కల్పించడం లక్ష్యంగా ఈ ప్రచారం ప్రారంభించింది. ఈ సిద్ధాంతంపైనే నిర్మించబడిన ఈ టీవీసీ, వ్యక్తులుగా మనం విభిన్న గొంతుకలతో ఎలా చుట్టుముట్టబడతామో చూపిస్తుంది. ఈ టీవీసీ లో పెప్సీ కుర్రాడి వ్యక్తిత్వంను ప్రదర్శిస్తూ, తన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరినీ ఈ గొంతుకలకు సవాల్ విసరమని ప్రోత్సహిస్తారు, తమ హృదయాన్ని అనుసరిస్తూనే, రైజ్ అప్ బేబీ ! (ఎదగండి బాబూ!)అని పిలుపునిస్తారు. ఈ నూతన ప్రచారం గురించి పెప్సీ కో ఇండియా , పెప్సీ కోలా, కేటగిరీ లీడ్, సౌమ్య రాథోర్ మాట్లాడుతూ " యష్తో మేము చేతులు కలిపిన దగ్గర నుంచి మేము అందుకుంటున్న స్పందన అపూర్వం. ఈ చారిత్రాత్మక భాగస్వామ్యంను దేశం అభిమానించింది. మేము వాగ్దానం చేసినట్లుగా, యశ్ నటించిన బ్లాక్బస్టర్ చిత్రంతో తిరిగివచ్చాము. మా పూర్తి సరికొత్త ప్రచారాన్ని ఇది ప్రదర్శిస్తుందని అన్నారు..

రేషన్ కార్డుదారులందరికీ ఇ-కేవైసి తప్పనిసరి

విశాలాంధ్ర బ్యూరో-ఏ ఎస్ ఆర్ జిల్లా: రేషన్ కార్డు దారులందరికీ తప్పనిసరిగా ఇ-కేవైసి చేయాల్సిందేనని జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివ ప్రసాద్ స్పష్టం చేసారు. శుక్రవారం పాడేరు మండలం సుంద్రుపుట్టు సచివాలయం-3 ను సందర్శించిన ఆయన వాలంటీర్లు, డిజిటల్ సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ, దరఖాస్తులు పూర్తిగా పెండింగ్ లో లేకుండా చూడాలని, సకాలంలో లబ్దిదారులకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న 70 సచివాలయాల పరిధిలో ఆదార్ అప్డేషన్ కేంద్రాలు సిద్ధంగా ఉన్నాయని, జిల్లాలోని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆధార్ అప్డేషన్ చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ఆయా సిబ్బంది స్పందించి వెంట వెంటనే సేవలు అందించాలని, జీరో పెండెన్సీ ఉండేలా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

విచ్చలవిడిగా కోడిపందాల బెట్టింగులు

వ్యసనాలకు బానిసలవుతున్న యువకులు

విశాలాంధ్ర-మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం పరిధిలోగల గ్రామాలలో విచ్చలవిడిగా కోడిపందాలు బెట్టింగులు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. వేసవికాలంలో జరిగే గ్రామదేవతల ఉత్సవాల వేదికగా లోతట్టు గ్రామాల్లో కోడి పందాలు గుండాట లు యదేచ్చగా జరగడంతో వాటికి ఆకర్షితులైన యువత వ్యసనాలకు అలవాటు పడి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. మధ్యం మత్తు లో కొట్లాటలు చోటుచేసుకోవడం వలన ప్రమాదాలకు గురవుతున్నారు.కోడి పందాలు గుండాట లు నాటు సారా గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తూ నే ఆదాయ వనరులైన వీటిపై ఒకపక్క అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించటం వలు విమర్శలకు కేంద్ర బిందువుగా మారుతుంది. ఇటీవల మన్యం అంతటా గ్రామదేవతల ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు నేపథ్యంలో దళారులు మధ్యవర్తిత్వంతో అధికారులకు ముడుపులు ముట్టుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏప్రిల్ 3 నుంచి జిల్లాస్థాయి క్రికెట్, వాలీబాల్ టోర్నీ



విశాలాంధ్ర -హుకుంపేట: స్థానిక మండల కేంద్రంలో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల సంద ర్భంగా హుకుంపేటలో ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి జిల్లా స్థాయి మెగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెట్ నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ నైని సత్తిబాబు తెలి పారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో పాల్గొనే జట్లు ఈ నెల 23 నుంచి రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి కావున ఇంకెవరైనా ఈ టోర్నమెంట్లు పాల్గొనే వాళ్ల రిజిస్ట్రేషన్ చేసుకో వాలని కోరారు. వాలీబాల్, క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి 25 వేలు, ప్రైజ్ మనీ మరియు ట్రోఫీ బహుమా నంగా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు 9441122779, 8688067322లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా భద్రావతీ పుస్కర పత్రి పూజ



విశాలాంధ్ర-అచ్యుతాపురం : శ్రీభద్రావతీ సమేత భావనాఋషి కళ్యాణ మహోత్సవం దుప్పి తూరు గ్రామంలో ఘనంగా నిర్వ హించారు. చేనేత, పద్మశాలీల ఆరాధ్య దైవమైన శ్రీభద్రావతీ సమేత భావన్నా రాయణ స్వామికి గురువారం పుస్కర పత్రి పూజచేసారు. చైర్మెన్ మాడెంసూరి అప్పారావు ఆద్వర్యంలో నిర్వహించిన కళ్యాణోత్సవంలో రాష్ట్ర పద్మశాలీ అధ్యక్షులు జగ్గారపు శ్రీనువాస రావుతో పాటు రాష్ట్ర పద్మశాలీ సంఘ నాయకులు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ఆలయానికి పునర్ని ర్మాణం, ఆలయ భూముల పరిరక్షణ, చేనేత కార్మికుల జీవన విధానం మెరుగుపరిచి, అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయ పునర్నిర్మాణానికి, సంఘం అభివృద్ధికి అహర్ని శలు శ్రమిస్తున్న మాడెం నూకరత్నం సూరి అప్పారావు దంపతులకు సంఘం పెద్దలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి యలమంచిలి టిడిపి ఇన్ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, వైసిపి నాయకులు కోన బుజ్జి, దేశంశెట్టి శంకర్రావు, ద్వారపురెడ్డి బాబ్జి, నర్మాలకుమార్, దేశంశెట్టి ఈశ్వర్రావు, శెట్టి నాగేశ్వ ర్రావు, దేశంశెట్టి కాసుబాబు పద్మశాలీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్

అరకు ఎంపీ నిధులతో సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటు

విశాలాంధ్ర-చింతపల్లి: సోలార్ విద్యుత్ దీపాల ఏర్పాటుతో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు పాలకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి ప్రత్యేక నిధులు 1.70 వేల నిధులతో మండలంలోని వివిధ ప్రాంతాలలో సోలార్ విద్యుత్ దీపాలు సమకూర్చారు. ముఖ్యంగా చింతపల్లి గ్రామ దేవత, మన్యం ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఆవరణతో పాటు, సామాజిక ఆరోగ్య కేంద్రం సమీప ప్రధాన రహదారి వద్ద, ఏ టి డబ్ల్యూ ఓ కార్యాలయం వద్ద, సంతబయలు వద్ద, లోతుగడ్డ జంక్షన్ కూడలి వద్ద, భీమసింగి గ్రామంలో ఒక్కొక్కటి చొప్పున అదే క్రమంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద రెండు సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ ఆలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంతం అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో నిత్యం జన సంచారం అధికంగా ఉండడాన్ని గుర్తించిన ఎంపీ మాధవి ప్రత్యేక నిధులు కేటాయించి సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో ఆలయ ఆవరణతో పాటు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రధాన రహదారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో వెలుగులు విరజిమ్మనున్నాయి. దీంతో రాత్రి వేళల్లో ఈ ప్రాంతాలలో ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు చెక్ పెట్టినట్లు అవుతుందని ఈ ప్రాంతీయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అల్లరి మూకల ఆగడాలను అదుపు చేయండి : తల్లిదండ్రుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-మారేడుమిల్లి: అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలంలో ఆగతాయుల ఆగడాలకు అడ్డు అదుపు లేకపోవడంతో విద్యార్థిని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారేడుమిల్లి లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలు ఉండడంతో ఆకతాయిలు ఆయా కళాశాల పరిసరాల్లో ద్విచక్ర వాహనాలతో సంచరిస్తూ కేరింతలు అల్లరిలతో విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు, మారేడుమిల్లి ఊరు శివారులలో ఉన్నటువంటి పరీక్షా కేంద్రానికి ఇంటర్ పరీక్షలు రాసేందుకు నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులను ఆకతాయిలు వెంబడించడం హంగామాలు చేయడం జరుగుతుంది. పోలీసులు ఇతర సంబంధిత అధికారులు స్పందించి తమ పిల్లలకు రక్షణ కల్పించాలని విద్యార్థిని తల్లిదండ్రులు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

సర్వ సమానత్వమే జమాతే ఇస్లామి హింద్ ముఖ్య ఉద్దేశం

నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకుల వితరణ

విశాలాంధ్ర-చింతపల్లి: రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని నిరుపేద ముస్లిం కుటుం బాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన జమాతే ఇస్లామీ హింద్. వివరాల్లోకి వెళితే జమాతే ఇస్లామి హింద్ కాకినాడ వారి సౌజన్యంతో జమాతే ఇస్లామీ హింద్ చింతపల్లి బాధ్యుడు షేక్ రెహమాన్ ఆధ్వర్యంలో 25 నిరుపేద ముస్లిం కుటుంబాలకు 15 రకాల సామాన్లు కలిగిన రంజాన్ రైస్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ పేద ధనిక బేధం లేకుండా సర్వసమానత్వమే జమాతే ఇస్లామి హింద్ ముఖ్య ఉద్దేశంగా ప్రతి ముస్లిం కుటుంబం రంజాన్ మాసాన్ని సంతోషకరంగా జరుపుకోవాలన్న లక్ష్యంతో నిరుపేద ముస్లిం కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, షేక్ దర్గా, షేక్ అన్వర్, షేక్ సత్తార్, షేక్ రెహమాన్, షేక్ మున్నీర్, షేక్ నజీర్, వల్లి తదితరులు పాల్గొన్నారు.

జాబ్కార్డుదారులందరికి ఉపాధి కల్పించాలి



విశాలాంధ్ర-నాతవరం: మండలంలో జాబ్కార్డు కలిగిన వారందరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని నాతవరం ఎంపిడిఓ యాదగిరీశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. వైయస్సార్ ఆసరా మూడో విడతపై క్షేత్ర స్థాయిలో డ్వాక్రా సంఘాల సభ్యులకు వివరించాలన్నారు. నూతన భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, పంచాయతీరాజ్శాఖల జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లి,బిడ్డ క్షేమం-జెడ్పీటిసి

విశాలాంధ్ర-యలమంచిలి : పోషకాలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లి, బిడ్డ ఆరోగ్యం క్షేమంగా ఉంటుందని యలమంచిలి జెడ్పీటిసి సేనాపతి సంధ్యారాణి అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ ఏటికొప్పాక గ్రామ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం అంగన్వాడి టీచర్లతో కలిపి పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పాలిచ్చే తల్లులు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకో వాలన్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డల కోసం గుడ్లు, పాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మాంసం వంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్ వైజర్ బేబీ,ఎంపిటిసి నగిరెడ్డి దేముడమ్మ,వైసీపీ నాయకులు సేనాపతి రాము, రవి,బంగారం, పాఠశాల కమిటీ చైర్మన్ లు ప్రసాద్, రమణ బాబు అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



టీబీ అంతమే లక్ష్యంగా కృషిచేయాలి

వాడవాడలా ప్రపంచ క్షయ దినోత్సవం..

విశాలాంధ్ర -చింతూరు: ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని చింతూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ రాలీ నీ సర్పంచ్ కారం కన్నారావు జడ్ పి ఉన్నత పాఠశాలలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ జడ్ పి ఉన్నత పాఠశాల నుండి మెడికల్ కాలనీ, సిపియం ఆఫీస్ చింతూరు మెయిన్ సెంటర్, డిప్యూటీ ఆఫీస్ వరకు కొన సాగింది. ఈ ర్యాలీ లో ప్రజల కు క్షయ వ్యాధి గురించి అవగాహన కలిగే విధంగా, వ్యాధి లక్షణాలు, వ్యాధి వ్యాపించిడానికి గల కారణాలు వీధులలో నినాదాలు ఇవ్వడం జరిగినది. ఈ ర్యాలీ ని ఉద్దేశించి సర్పంచ్ కారం కన్నారావు మాట్లాడుతూ టి బి అంతం మన వంతం అనే నినాదం తో ప్రతీ ఒక్కరు టి బి వ్యాధిని అరికట్టడానికి కృషి చేయాలన్నారు. తులసిపాక మెడికల్ ఆఫీసర్ నిఖిల్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, అలసట, బరువు తగ్గడం మొదలగు లక్షణాలు ఉన్న వారిని క్షేత్ర స్థాయి లో ఏ యన్ యం లు, ఆశ కార్యకర్తలు వెంటనే గుర్తించి పి హెచ్ సి కి తీసుకుని వచ్చి తెమడ పరీక్ష చేయించి వెంటనే మందులు వాడించాలని తెలియ చేసారు. అలాగే టి బి వ్యాధిని సమాజం నుండి పార దోల దానికి ప్రతీ వ్యక్తి ఒక నాయకుడిగా వ్యవహరించి టి బి కి వ్యతిరేకంగా పోరాటం వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాంజనేయులు, హెచ్ ఇ ఓ రాంప్రసాద్ వి.దారయ్య, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు తుర్రం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, తులసిపాక పి హెచ్ సి సూపర్వైజర్లు, హెల్తసిస్టెంట్స్. ఎయం లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

చోడవరం : క్షయ వ్యాధి 2025 నాటికి అంతమే లక్ష్యంగా పని చేయాలని చోడవరం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరెంట్ ఎల్.వినయ్ కుమార్ సూచించారు. టి.బి.యూనిట్, ఐ.సి.టి. సి., జీత్ ఎన్జీవో ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంలో భాగంగా చేపట్టిన ర్యాలీ ను ఆసుపత్రి సూపరెంట్, చైర్మన్ జ్యోతుల రమేష్ ప్రారంభించారు. విద్యార్థులు, వైద్య సిబ్బంది కొత్తూరు జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యులు వినయ్ కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు 2025 నాటికి క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. కళ్లె (ఉమ్మి) నిర్ధారణ పరీక్షలు ద్వారా త్వరితగతిన వ్యాధి గుర్తించడం, ఉచితంగా మందులు అందజేయడం, పోషకాహార కొరకు క్షయ పోషణ యోజన ద్వారా వ్యాధి గ్రస్తుల ఖాతాలకు నెలకు రూ.500లు నేరుగా అందజేయడం జరుగుతుంది అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, హెల్త్ వెల్ నెస్ కేంద్రాల ద్వారా నిరంతర స్క్రీనింగ్, డాట్స్ పద్ధతిలో నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో 87 మంది మందులు తీసుకుంటున్నారని, వారిలో 5 గురు మొండి వ్యాధిగ్రస్తులున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టి.బి. యూనిట్ వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షయని అంతమొందిద్దాం.

సామాజిక ఆసుపత్రి సూపరిండెంట్ ఆదిత్య కీర్తి

చింతపల్లి : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షయ వ్యాధిని మనం అంత మొందించగలం (యస్ వుయ్ కెన్ ఎండ్ టీ బీ) అనే నినాదంతో క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని చింతపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆ శాఖ సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరిండెంట్ ఆదిత్య కీర్తి పాల్గొని ప్రసం గించారు. ఆమె మాట్లాడుతూ తుంపర్ల ద్వారా ఇతరులకు సోకే వ్యాధి క్షయ అన్నారు. కొద్దిపాటి జాగ్రత్తలతో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చున్నారు. స్థానికంగా ఆసుపత్రిలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఎక్స్ రే సదుపాయాలు ఉన్నాయన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే రోగులకు ఉచిత మందుల పంపిణీ తో పాటు ప్రతి నల 500 రూపాయలు చొప్పున ఆరు నెలలకు గాను పోషణ నిమిత్తం 3000 రూపాయలు చెల్లించడం జరుగుతుందన్నారు, గిరిజనులకు నెలకు 750 రూపాయలు చొప్పున అందించడం జరుగుతుందన్నారు. మూడు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు, రాత్రిపూట జ్వరం, బరువు తగ్గడం తదితర లక్షణాలు గల వారు తప్పనిసరిగా రక్త, కఫం పరీక్షలతో పాటు ఎక్స్ రే తీయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి నగర్ వైద్యాధికారులు సౌమ్య, మహేష్, సిహెచ్ఓ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ షారుక్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మలిద్దాం

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో రాజవొమ్మంగి సింగంపల్లి వైద్యాధికారి శ్రీ దుర్గ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం జరిపారు,ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ చేపట్టి క్షయవ్యాదిని పూర్తిగా నిర్మలిస్తామని నినాదాలు చేశారు,ఈ సందర్భంగా డాక్టర్ శ్రీ దుర్గ మాట్లాడుతూ క్షయవ్యాదిగ్రస్తుల నోటి తుంపర్ల వలన ఈ వ్యాధి ఇతరులకు వ్యాపిస్తుందని, వీరు కచ్చితంగా మాస్క్ ధరించాలని తెలిపారు. క్షయవ్యాది పోషకాహారలోపం వలన, వ్యాధి నిరోధక శక్తి లేకపోవడం వలన తొందరగా సంక్రమిస్తుంది తెలిపారు,పదిరోజులు పైబడి దగ్గు ఉంటే దగ్గరిలో నున్న ఆరోగ్యకేంద్రానికి వెళ్లాలని తెలిపారు, కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ చింతల నానిబాబు,ఆశా వర్కర్లు,ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తం

చింతపల్లి: క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండా లని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జానకి అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల (బాలురు) విద్యార్థులతో కలిసి క్షయ వ్యాధిని తరిమికొడదాం - ఆరోగ్యంగా జీవిద్దాం అనే నినాదంతో అవగాహన కలిపించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యవతి, ఆశ్రమ పాఠశాల హెచ్.ఎం ఎస్ వెంకట రమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి బాధితులకు లీ ఫార్మా బాసట..



కూర్మన్నపాలెం: దువ్వాడలో గల సెజ్ ఆవరణ లోని లీ ఫార్మా కంపెనీ టీబీ బాధితులకు అండగా నిలిచింది. ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా వందమంది టిబి బాధితులకు ఫోషకాహారం తో పాటు ఫోషకాలతో కూడిన మందుల కిట్లను అందించింది. కార్యక్రమంలో పాల్గొన్న లీ ఫార్మా డైరెక్టర్ ఆళ్ళ లీలా రాణీ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ బాధితులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే వ్యాధి తీవ్రత తక్కువగా వుంటుందన్నారు. కార్యక్రమంలో ఔషద నియంత్రణ మండలి అధికారి చంద్ర శేఖర్, ఫార్మా కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ పై వచ్చిన వారికి పై నిఘా పెట్టాలి : ఎస్పీ గౌతంశాలి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: గంజాయి కేసులో అరెస్ట్ బెయిల్ పై వచ్చిన వారిపై నిఘా పెట్టాలని ఎస్పీ గౌతమి సాలి ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన నెలవారీ నేర సమీక్షా సమావేశం లో దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, ముఖ్యంగా గంజాయి కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా చేస్తున్న, వారికి సహకరిస్తున్న వ్యక్తులను, ఎక్కడ నుండి గంజాయి వస్తుందని సమాచారాన్ని సేకరించాలన్నారు. గంజాయి కేసుల్లో ఉన్న వారిపై పీడీ యాక్టు నమోదు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. తప్పించుకు తిరుగుతున్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు.ఎండాకాలంలో చోరీలు ఎక్కువ జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు, వ్యాపార సంస్థలు ముఖ్య జంక్షన్ ల వద్ద సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) .విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ కె.ప్రవీణ్ కుమార్, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, అప్పలనాయుడు, ఎస్సైలు రామారావు, రఘువర్మ జిల్లా సిఐలు , ఎస్సైలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా అనిత పుట్టిన రోజు వేడుకలు

విశాలాంధ్ర-యస్. రాయవరం : టిడిపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం అనిత పుట్టిన రోజు ఫ్రేంచీస్ అడ్డురోడ్డులో శ్రీనివాసు కల్యాణం మండపంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆమె కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవిందు సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు యనమల కృష్ణుడు లు వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వై. వినోద్ రాజు, టిడిపి మండల అధ్యక్షులు అమలకంటి అబద్ధం, పాయకరావుపేట టిడిపి అధ్యక్షుడు పెద్ది రెడ్డి చిట్టిబాబు, కోట ఉరట్ల టిడిపి అధ్యక్షుడు జానకి శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు నల్లపరాజు వెంకటరాజు, తమ్మపాల నాగేశ్వరరావు, కందుల వేంకటేశ్వరరావు, గుర్రం రామకృష్ణ, కురందాసు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్పందన సమస్యల పరిష్కారానికి అధికారులు వ్యక్తిగత శ్రద్ధ : ఐటీడీఏ పీఓ



విశాలాంధ్ర-పాడేరు : స్పందనలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలని ఐటిడిఏ పి ఓ రోణంకి గోపాల క్రిష్ణ స్పష్టం చేసారు.. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ అభిషేక్ తో కలిసి వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో 47 అర్జీలను స్వీకరించారు. గిరిజన ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపించాలని అన్నారు. పెదబయలు మండలం బొంగరం పంచాయతీ పోతుల గరువు గెడ్డ నుండి రాస కొండ బాల చెల్లమ్మ అమ్మవారి గుడి వరకు రోడ్డు నిర్మించాలని జామిగుడ ఎంపిటిసి జి. నిర్మల వినతిపత్రం సమర్పించారు. పాడేరు మండలం గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామానికి చెందిన పలాసి పిన్నయ్య సాగుభూములను సర్వే చేయించి పట్టాలు మంజూరు చేయాలని వినతి లో కోరారు. పెదబయలు మండలం కిముడుపల్లె పంచాయతీ సావిడి మామిడి గ్రామానికి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని గ్రామస్తులు కె. నాగరాజు, పి.నాగేశ్వరరావు దరఖాస్తును అందజేసారు. పాడేరు మండలం ఇరడాపల్లి పంచాయతీ బొడ్డపుట్టు, నరియాపల్లి, వీనమామిడి గ్రామాలకు జి.మాడుగుల నుండి విద్యుత్తులైన్లు ఉన్నాయని వాటిని సోలములు గ్రామం మీదగా మార్చాలని గుల్లేల లింగమూర్తి కోరారు. పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ పనస పల్లి గ్రామం వద్ద నిర్మించిన చెక్ చెల్లించాలని గొల్లోరి నీల కంఠం అర్జీని అందజేసారు. డ్యాం బిల్లుఈ కార్యక్రమంలో ఎస్డి సి (గిరిజన సంక్షేమ) వివి ఎస్ శర్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జామాల్ భాషా, ఐసి డి ఎస్ పిడి సూర్యలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

క్షయ పై ప్రజల్ని చైతన్య పరుస్తూ ర్యాలీ

సింహాచలం: గ్రేటర్ విశాఖ 98వ వార్డ్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది, ఏ. ఎం.సి జూడాలు , నర్సింగ్ విద్యార్థులు ప్రపంచ క్షయ వ్యాధి (టిబి) ర్యాలీ నిర్వహించారు. వయసు, జెండర్, ఆర్థిక స్థితి లాంటి తేడాలు లేకుండా లక్షల మంది క్షయ బారిన పడుతున్నారు. ప్రపంచంలోనే ఎక్కువ మంది క్షయ బాధితులు భారత దేశంలో ఉన్నారు. క్షయవ్యాధి సాధా రణంగా ఊపిరితిత్తులకు సోకుతుంది. కానీ ఇది గోరు, జుట్టు తప్ప శరీరంలోని ఏ అవయవానికైనా సోకే అవకాశం ఉంది. రోగులు దగ్గినప్పుడు, లేదా తుమ్మినప్పుడు తుంపర్లలోని వ్యాధి కారక బ్యాక్టీరియా, గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. తరవాత తన శరీరంలోని ఇతర అవయవాలకు సోకుతుంది. పుట్టిన పిల్లలకు బీసీజీ టీకా ఇప్పించాలి. ఈ టీకా తీసుకున్న పిల్లలకు పూర్తిగా క్షయ వ్యాధి సోకదు అని చెప్పలేం. కానీ, తీవ్రమైన వ్యాధి కలగకుండా ఉంటుంది.పోషక ఆహారం తీసుకుంటూ, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉండాలి. పొగాకు ఏ రకంగా అయినా వాడకుండా ఉండడం, అలాగే వాయు కాలుష్యాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. క్షయ వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా మాస్క్ వాడడం, దగ్గినా, తుమ్మినా చెయ్యి అడ్డు పెట్టుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలి. రెండు వారాలకు మించి ఏవైనా లక్షణాలు ఉంటే, వెంటనే పరీక్ష చేసుకోవాలని డాక్టర్లు పేర్కొన్నారు. డిప్యూటి సివిల్ సర్జన్ డాక్టర్. భాస్కరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ శివరామ కృష్ణ, ఎస్వి రమణ, పార్వతీశం, నర్సింహ రావు, ఎల్మో దేవి, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైయస్సార్ ఆసరా కింద మూడవ విడతలో గుండాల సచివాలయ పరిధికి 67 లక్షల విడుదల



విశాలాంధ్ర-ఎటపాక : అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గంలో ఎటపాక మండలంలోనిగుండాల సచివాలయ పరిధిలో ఉన్న 94 సంఘాల గ్రూపు లీడర్లు మరియు సంఘాల సభ్యులు అందర్నీ గుండాల హైస్కూల్లో మీటింగ్ పెట్టి మూడో విడత ఆసరా పథకం గురించి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గుండాల ఎంపిటిసి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గుండాల సచివాలయ పరిధిలోని 94 సంఘాలకు 67 లక్షల రూపాయలను వైయస్సార్ ఆసరా కింద మంజూరు చేశారు. ఈ మంజూరైన నిధులను ఈనెల 25వ తేదీ మార్చిన ముఖ్యమంత్రి గారు డైరెక్ట్ గా వార్ అకౌంట్లోకి జమ చేయడం జరుగుతుందని, వైయస్సార్ ఆసరా ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కిగుండాల సచివాలయ పరిధిలో ఉన్నటువంటి ప్రజలందరూ కూడాధన్యవాదములు తెలియజేసారు. కార్యక్రమంలో గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి,గుండాల సర్పంచ్ సీతాలక్ష్మి , వైయస్సార్ క్రాంతి పదం, ఏపిఎం స్వామి, సీసీలు సత్యనారాయణ, కృష్ణవేణి , వివో ఏలు, స్వయం సహాయక సంఘాల గ్రూపు లీడర్లు, సభ్యులు అందరూ పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు అండగా కొయ్యూరు పోలీసులు



విశాలాంధ్ర- కొయ్యూరు : తాటి మానుపాలెం అగ్నిబాధిత కుటుంబాలకు కొయ్యూరు పోలీసులు సహాయ సహకారాలు అందించి అండగా నిలిచారు. మండలంలోని అంతాడ పంచాయతీ తాటిమానుపాలెం గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగు తాటాకిళ్ళు దగ్ధమై ఏడు కుటుంబాల గిరిజనులు నిరాశ్రయులైన సంగతి తెలిసిందే. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు కొయ్యూరు పోలీసులు సిద్ధపడ్డారు. సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు మంప ఎస్ఐలు రాజారావు లోకేష్ కుమార్ తమ సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పోలీస్ శాఖ తరపున 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరమైన తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. తమ వంతు సహాయ సహకారాలు అందించడమే కాకుండా అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న పోలీసులకు బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేసారు.

సామాన్య రైతుల జీవనోపాధి అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : భారతదేశంలో సామాన్య రైతుల జీవనోపాధిని మెరుగుపరచడానికి వాల్మార్ట్ ఫౌండేషన్ ఐదేళ్ల వ్యూహాన్ని ప్రకటించింది. విశాఖలో వ్యవసాయ వ్యవస్థలను బలోపేతం చేయడం, చిన్నకారు రైతులను ఆదుకునేందుకు మరియు ప్రోత్సహించే మార్గం పై సదస్సు ను నిర్వహించారు. సదస్సును ఫిక్కి చైర్మన్, నూజివీడు సీడ్స్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ %ు% చైర్మన్ %ు% మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్ రావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ముందుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చిరంజీవ్ చౌదరి వర్చువల్ ద్వారా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా వాల్మార్ట్ వైస్ ప్రెసిడెంట్ చీఫ్ సస్టైనబిలిటీ అధికారి కాథ్లీన్ మెక్లాఫ్లిన్ మాట్లాడుతూ 2028 నాటికి కనీసం శాతం మహిళలతో 1 మిలియన్ చిన్నకారు రైతులను చేరుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు మధ్య తరగతి రైతులకు మద్దతు ఇచ్చే ప్రయత్నాలను వివరించారు. కార్యక్రమంలో వాల్మార్ట్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ జూలీ గెర్కి, ఫ్లిప్కార్ట్ గ్రూప్ కార్పొరేట్ వ్యవహారాల సలహాదారు నిశాంత్ గుప్తా,సంబోధి రీసెర్చ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అవంతి కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు



విశాలాంధ్ర-మాకవరపాలెం: స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు స్పార్క్స్ (లైట్నింగ్ ఆఫ్ థాట్స్ పాత్వే ఆఫ్ ఫ్యూచర్) శుక్రవారం ప్రారంభమైంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విశాఖపట్నం ఎన్ఎస్టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ భారత్ గుర్తు చేస్తూ మన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మనకు కావలసిన ఉత్పత్తులు మనమే తయారుచేసుకోవాలని, అందుకు గాను ప్రతీ ఒక్కరూ వినూత్నంగా ఆలోచించడం ద్వారా అది సాధ్యమౌతుందన్నారు. అంతేకాకుండా నిజమైన హీరో సైంటిస్ట్, వాళ్లు మన దేశానికి ఎంతో సేవ చేస్తున్నారని గుర్తు చేశారు. మన పురాణాల్లో ఎంతో సైన్స్ ఉందని అవి చదవడం ద్వారా ఎంతో నేర్చుకోవచ్చునన్నారు. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ జయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్లో ఎనర్జీ సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ, ఫుడ్ సెక్యూరిటీ పై పరిశోధన జరుగుతుందని తెలిపారు. సెమినార్సు ప్రజెంటేషన్ ఇవ్వడం ద్వారా ఆ విషయాలలో నైపుణ్యం సాధించవచ్చునన్నారు. ఎన్ఆర్డిసి అసిస్టెంట్ డిపార్టుమెంట్ డిన్నర్ ఎస్.సుధా మాట్లాడుతూ విద్యార్థుల విజయం కోసం టు బి క్యూరియస్, లెర్న్ ఫ్రమ్ ఆవర్ మిస్టేక్స్, ఆస్క్ ఫర్ హెల్ప్, బిఓపెన్టు కెరీర్ ఆపర్చునిటీ, ఫాలో యువర్ మెంటల్ ఈ ఐదు సూచనలు పాటిస్తే విజయం సాధించవచ్చునన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్రావు మాట్లాడుతూ స్పార్క్స్ ఈవెంట్ ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడిందన్నారు. వినూత్న ఆలోచనలు ఎప్పుడు భవిష్యత్కు బంగారు బాట అవుతుందన్నారు. ఈ జాతీయ సాంకేతిక సదస్సులో పేపర్ ప్రజెంటేషన్, హెచ్ఆర్ ఇంట్రాక్షన్, గెస్ట్ లెక్చర్స్, క్విజ్ వంటి ఈవెంట్స్ నిర్వహించనున్నారు. పేపర్ ప్రజెంటేషన్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రతీ డిపార్టుమెంట్కి మొదటి బహుమతి రూ.2వేలు, రెండో బహుమతి రూ.1000 ఇవ్వనున్నారన్నారు. అనంతరం ముఖ్య అతిధులను అవంతి కళాశాల జనరల్ సెక్రటరీ డాక్టర్ ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్

చిన్నారులకు నాటు వైద్యం, పసురు మందు పట్టించవద్దు

విశాలాంధ్ర-హుకుంపేట: ఏజేన్సీ వ్యాప్తంగా నాటు అవిధ్యానికి, పసురుమందుకు నమ్మి చిన్నారులు మృత్యువాత చెందుతున్నారని, చిన్నారులకు నాటు వైద్యం అందిస్తు పసురు మందులు పట్టించ వద్దని జడ్పిటీసీ సభ్యుడు రేగం మత్యలింగం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమెరికన్ ఇండియన్ ఫౌండేషన్ మరియు స్థానిక ఉప్ప పిహెచ్సీ, ఐసీడీఎస్ శాఖ వారు సంయుక్తంగా మూడ నమ్మకం, నాటు వైద్యుల ద్వారా అందిస్తున్న నాటు వైద్యాం, నాటు మందుల నివారించేందుకు ఉప్ప పరిసరాల ప్రాంతంలో ఉన్న నాటు వైద్యాలు(గురువుల)ను పిలిపుంచి శుక్రవారం ఉప్ప గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి జడ్పిటీసీ మత్యలింగం, ఎంపిడీ వో వెంకటరావు, తహాశీల్దార్ రాజ్య లక్ష్మి ముఖ్య అతిధులుగా హాజరై య్యారు. ఎంపిడీవో,తహాశీల్దర్లు మాట్లా డుతు గ్రామల్లో చిన్నారులకు పసురుమందు పట్టించరాదని. ఇకపై ఎక్కడైన ఈ పరిస్థితులు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ బాలచంద్రమణి దేవి,స్థానిక వైద్యాధికారులు డా అనుష, డా ప్రశాంత్ ,సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ కృష్ణ, స్థానిక సర్పంచు, ఎంపీటీసీ, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పినగాడి రోడ్డుకు మోక్షం కల్పించండి.: ఎమ్మెల్యే అదీప్ రాజ్

విశాలాంధ్ర-పెందుర్తి: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రెడ్డి నియోజక వర్గంలోని పలు సమస్యలను శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. సింహాచలరొపినగాడి రోడ్డుకు గతంలోనే నిధులు మంజూరైనా కొన్ని కారణాల వలన పనులు పూర్తి కాలేదని సభ ధ్రుష్టికి తీసుకొచ్చారు. విశాఖ నగరం నుండి చోడవరం, మాడుగుల, నర్సీపట్నం సహా అనేక ప్రాంతాలకు ముఖ్యమైన రహదారిగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే పరవాడ ప్రాంతంలో పిట్టవానిపాలెం సహా అనేక ప్రాంతాలు కాలుష్యకారకంగా మారాయని అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అదీప్ సభలో ప్రస్తావించారు. వ్యవసాయం కూడా సరిగా దిగుబడి రాలేదని ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-కూనవరం: రోడ్డు ప్రమాదాల నివారించడానికి అందరూ బాధ్యత వహించాలని నిర్లక్ష్యం గా వాహనాలు నడపడం తమ ప్రాణాలకు ఎదుటివారి ప్రాణాలకు కూడా ప్రమాదమేనని కూనవరం ఎస్సై బి వెంకటేష్ సూచించారు. వాహనదారులకు తగు సూచనలు ఇచ్చారు. ఆటో ద్వారా మైకు ప్రచారం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపద్దని సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం రోడ్డు భద్రతకు సంబంధించిన కరపత్రాలను పంచారు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా రైన్డీర్ హెర్డింగ్ ఛాంపియన్షిప్

విశాలాంధ్ర-విశాఖ సిటీ: మొదటి అంతర్జాతీయ సాంప్రదాయ రైన్డీర్ హెర్డింగ్ ఛాంపియన్షిప్ రిపబ్లిక్ ఆఫ్ సఖా (యాకుటియా) నగరం నెర్యుంగ్రి మరియు ఇయంగ్రా గ్రామంలో మార్చి 15-19 తేదీలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్కిటిక్ ఫార్ ఈస్ట్, చైనా, మంగోలియా, ఐస్లాండ్ మరియు గ్రీన్ల్యాండ్లోని 14 ప్రాంతాల ప్రతినిధులు, అలాగే రష్యన్ అసోసియేషన్ ఆఫ్ ఇండిజినస్ పీపుల్స్ ఆఫ్ ది నార్త్, లెజిస్లేటివ్ అధికారులు మరియు వ్యాపార సభ్యులు సభ్యులు పాల్గొన్నారు. అసోసియేషన్ ఆఫ్ వరల్డ్ రైన్డీర్ హర్డర్స్. ఈ ఛాంపియన్షిప్ 2021-2023లో ఆర్కిటిక్ కౌన్సిల్కు రష్యా చైర్మన్షిప్ ఈవెంట్ల ప్రణాళికలో భాగంగా నిర్వహించబడింది, వీటిని రోస్కొంగ్రెస్ ఫౌండేషన్ నిర్వహిస్తుంది. స్వదేశీ ప్రజల జీవన విధానం మరియు సంస్కృతిని సంరక్షించడంలో రైన్డీర్ మంద ఒక ప్రధాన అంశం, అలాగే ఆర్కిటిక్ ప్రాంతాల్లోని అనేక తరాల నివాసితులకు లింక్. అదనంగా, ఈ క్రాఫ్ట్ స్థానిక ఉత్పత్తిదారులకు గొప్ప ఆర్థిక ప్రాముఖ్యతను కలిగి ఉంది మరియు స్థానిక ఆహార మార్కెట్లలో సరఫరాదారులుగా డిమాండ్లో ఉండటానికి వీలు కల్పిస్తుంది.

ఎస్పిసిఏ కమిటీ సభ్యులుగా రామాల శ్రీనివాసరావు



విశాలాంధ్ర-పాయకరావుపేట : సమాజంలో జంతువుల పట్ల క్రూరత్వాన్ని నిరోధించే కమిటీ (ఎస్పిసిఏ) అనకాపల్లి జిల్లా సభ్యులుగా మండలంలోని నామవరం గ్రామానికి చెందిన రామాల శ్రీనివాసరావు నియమితుల య్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి నుండి ఆదేశాలు జారీ అయ్యాయి. కమిటీలు చైర్మన్ గా కలెక్టర్, వైస్ చైర్మన్ లుగా జిల్లా పరిషత్తు సీఈఓ, జిల్లా ఎస్పీ, కార్యదర్శిగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జంతువుల పట్ల మానవతా దృక్పథం కలిగిన ఇద్దరు వ్యక్తులు, తో పాటు 12 మంది సభ్యులను కమిటీ లో ఉంటారు. కమిటీ జిల్లా సభ్యుడిగా రామాల శ్రీనివాసరావు తో పాటు, అదే గ్రామానికి చెందిన బి. దేవుళ్ళు నియమితులయ్యారు. యాక్ట్ 1960 అమలు, జంతువుల సంరక్షణ, జంతువుల తరలింపు అరికట్టడం కమిటీ సభ్యుల ముఖ్య బాధ్యతగా ఉన్నట్లు ఉత్తర్వులు లో పేర్కొన్నారు.

2024 లో ఎమ్మెల్యేగా అభ్యర్థిగా వస్తున్న మీ వంతల రామన్న

విశాలాంధ్ర-పాడేరు : అందరి ప్రియ తమా నేత మంచి మనసున్న యువనేత ఆదివాసి యుగపురుషుడు కష్టం నుంచి వచ్చినా కష్టజీవి వంతాల రామన్న విశాఖపట్నం కెజిహెచ్ లో గత మూడు వారాలుగా చికిత్స పొందుతున్న కీముడుపెల్లి ఎంపిటిసి పాంగి రామారావు యొక్క ఆరోగ్య బాగోగులను తెలుసుకుంటున్న ఆదివాసి జననేత రామన్న ముందుకు సాగుతున్నారు.ఈ కార్యక్రమం లో అలాగే 2014 ఎంపీ ఎమ్మెల్యే అలాగే 2019 ఎమ్మెల్యే గెలవడానికి కీలక పాత్ర వహించిన రాజకీయ ఉద్దండు లికూడా కల్యాణం శోభ పంచాయతీ మాజీ ఎంపిటిసి డేవిడ్ రాజు, ఏ బి రాజు ,వెంకట్, రాజు, పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా పోలిన అప్పారావు



విశాలాంధ్ర రావికమతం : రావికమతం మండల యూటీఎఫ్ అధ్యక్షునిగా పోలిన అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా ఎం. శివశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎంపీపీ పాఠశాల(మెయిన్) నందు రావికమతం మండల యు.టి.ఎఫ్. సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏర్పాటు చేసి నూతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.. ఈ సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాళింగ సతీష్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా కే శ్రీనివాసరావు., సహాధ్యక్షులుగా బి .అప్పలనాయుడు ,కే గౌరీ ,కోశాధికారిగా మట్టా అప్పారావు. కార్యదర్శులుగా జి. నాగేశ్వరరావు, రాజేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్గా బి. కోటేశ్వరరావు జిల్లా కౌన్సిలర్గా యు. వి రమణ మూర్తి, కే .శ్రీను లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ నందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విశేషంగా కృషి చేస్తుందని అన్నారు., ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేయడం జరుగుతుందన్నారు., రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరంతరం ప్రతిఘటిస్తు, సి.పి.ఎస్. రద్దు కోసం నిరంతర పోరాటాలు చేస్తుందని తెలియజేశారు. ఉపాధ్యాయులంతా యుటిఎఫ్ చేసే ఉద్యమాలలో పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న వినాశక చర్యలను ఖండించాలని కోరారు. ఉపాధ్యాయులకు బకాయిపడ్డ డి.ఎ. బకాయిలు వెంటనే విడుదల చేసి, పి.ఆర్.సి. వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తదనంతరం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, సంఘ నియమనిబంధనలు పాటిస్తామని, అన్యాయాలను, అక్రమాలను సహించమని, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. మండలంలో ఉన్న ఉపాధ్యాయుల హక్కుల కొరకు, సమస్యల పరిష్కారం కొరకు, విద్యాభివృద్ధి పెంచుటకు యు.టి.ఎఫ్. కృషిచేస్తుందని తెలియజేశారు.

ఓటిటీ వెబ్ సిరీసులకు సెన్సార్ తప్పనిసరి చేయాలి : వెంకటరమణ

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సృజనాత్మకత ముసుగులో ఓటీటీ వేదికల్లో ప్రసారమయ్యే వెబ్ సిరీసులకు సెన్సార్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య (కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఓటీటీ కొన్ని వెబ్ సిరీసుల్లో మితిమీరుతున్న అశ్లీలత, ధోరణులపై 2021లో 'నిబంధనలైతే కచ్చితంగా ఉండాలి' అని సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని, అదే విధంగా తగిన చట్టం, మార్గదర్శకాలను రూపొందించాలని ఢిల్లీ హైకోర్టు సూచించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నేటికీ పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా అసాంఘిక వెబ్ సిరీసుల నియంత్రణకు తక్షణం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర సమాచార ప్రసారమంత్రిత్వ శాఖకు శుక్రవారం సోషల్ మీడియా వేదికగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజా ఉద్యమాలు ఉధృతం కాకముందే ప్రభుత్వం స్పందించాలని ఆయన హెచ్చరించారు. సెన్సార్ విధానమే లేని ఓటీటీ ప్రసారాల్లో అసభ్యత శ్రుతిమించి స్వైరవిహారం చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. సామాజిక మాధ్యమాలు, ఓటీటీ వేదికల్లో అసభ్య పదజాల వినియోగాన్ని తీవ్రంగా పరిగణించాలని, ప్రసారానికి ముందు వెబ్సిరీసులను అధికార వర్గాలు పరిశీలించాలన్నారు.

రాబోయే ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయం

విశాలాంధ్ర రాజవమ్మంగి : రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ పట్టభద్రులు కోటా ఎమ్మల్సీలు మూడు ఎమ్మెల్యే కోటా ఒక ఎమ్మెల్సీ విజయం సాధించడంతో మండల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేసి,గెలిచిన వారికి శుభాకాంక్షలు తెలిపారు ఈసందర్భంగా స్థానిక అల్లూరి సీతారామరాజు సెంటరు వద్ద విజయోత్సవ సభ నిర్వహించి బాణాసంచా కాల్చారు,అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు,ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మండల తెదేపా అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగిన టిడిపి పార్టీ గెలుపు తథ్యమని, వైసిపి ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు,రాష్ట్రమంతా సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో ఉన్నారని త్వరలోనే జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగినబుద్ధి చెబుతారని అన్నారు, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టారని అన్నారు కార్యక్రమంలో అరకు పార్లమెంటు ఉపాధ్యక్షుడు దంతులూరి శివాజీ, రాజవమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణీ,పెదిరెడ్ల సత్యనారాయణ,ముప్పన డింబకేశావ్, ముప్పన సావిత్రి,మాకాడ బుల్లమ్మ,మరిశే సత్తిబాబు, బాబ్జీ, జెట్టి మధుశేఖర్,నక్కా రాజు,చెక్కా లోవరాజు,టిడిపి ఎంపిటిసిలు,వార్డు మెంబర్లు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

సిఆర్పిఎఫ్ డి 141 బిఎన్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్...

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు మండలం, ఏడుగురాళ్లపల్లి లో, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ కమాండెంట్ ప్రశాంత్ ధర్, ఆదేశాలు మేరకు శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది.మెడికల్ క్యాంపులో ఏడుగురాళ్లపల్లి, పేగా, మరియు చుట్టుపక్క గ్రామ ప్రజలు రావడం జరిగింది వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని బ్లడ్ టెస్ట్ లు నిర్వహించి 250 మందికి రోగులకు మందులు ఇవ్వడం జరిగింది.అలాగే పిల్లలకు ఆట వస్తువులు క్యారమ్ బోర్డ్, చెస్, వాలీబాల్, ఫుట్బాల్, తదితర సామాగ్రిని పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ ధర్, మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రజలకు సహాయపడటంలో సిఆర్పిఎఫ్ ఎప్పుడు ముందు ఉంటుందని ప్రజలు సహాయ సహకారాలు మంచిగా ఉన్నాయని ఇక ముందు కూడా గ్రామాలలోకి వెళ్లి మెడికల్ క్యాంపులు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలు చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ సెకండ్ కమాండెంట్ కమల్ వీర్ యాదవ్, సిఆర్పిఎఫ్ ఎస్ఎంఓ డాక్టర్ కల్పన, ఏడుగురాళ్లపల్లి పీహెచ్సీ డాక్టర్ ప్రసన్న, ఏడుగురాళ్లపల్లి సిఆర్పిఎఫ్ డి 141 ఓసి పసుపులేటి కాశయ్య, చింతూరు సీఐ అప్పలనాయుడు, ఎస్సై శ్రీనివాసరావు, సర్పంచులు సవలం సత్తిబాబు, చంద్రయ్య, మరియు సిఆర్పిఎఫ్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, స్కూల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శిధిలావస్థకు చేరుకున్న తుఫాను భవనం...

విశాలాంధ్ర-పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలో నిర్మించినటువంటి తుఫాను భవనము శిథిలావస్థకు చేరుకున్నది దీనిపై ఈరోజు పాండ్రంగి ఒకటో వార్డు మెంబరు మహంతి అప్పల రమణ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్చార్జ్ ఎంపీడీవో పి రాధా కు వినతిపత్రం అందజేయడం జరిగింది శిథిలావస్థకు చేరుకున్న తుఫాను భవనం కూలిపోయే స్థాయిలో ఉందని ఎప్పుడు కూలిపోతుందో తెలియదని దానిని అనుకొని ఉన్న ప్రభుత్వ మంచినీరు బోరింగు ప్రతిరోజు నిత్యం గ్రామంలో ఉండే మహిళలు పిల్లలు ముసలివారు అక్కడికి మంచినీరు కోసం వెళ్తూ ఉంటారు ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందని భయపడుతూ అక్కడికి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు ఒకవేళ జరగరానిదే జరిగితే ప్రాణాలకే ప్రమాదమని భయపడుతున్నారు కావున తమరు ఈ విషయంపై దృష్టి సారించి శిథిలావస్థకు చేరుకున్న తుఫాను భవనాన్ని పడగొట్టి ఆ స్థానంలో నూతన తుఫాను భవనాన్ని నిర్మించాలని కోరుకుంటున్నామని గ్రామస్తులు తరపున వినతి పత్రం అందజేశారు.

మారుమూల గ్రామాల్లో పిఓ సుడిగాలి పర్యటన

విశాలాంధ్ర-దేవీపట్నం: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో రహదారి సదుపాయం కు ఆటంకం గా మారిన కొండ కాలువలపై కొత్తగా మంజూరై వంతెనలను త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు, శుక్రవారం వై. రామవరం మండలం చింతలపూడి పంచాయతీలోని బంగారు బంధాలు కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఈ బంగారు బందలు కాలువపై వంతెన పూర్తి అయితే వర్షాకాలంలో కాలువ ఎక్కువ వచ్చిన రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వంతెన కొరకు ఈ పంచాయతీలోని ప్రజాప్రతినిధులు దరఖాస్తు చేసినందువలన సంబంధిత అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి ఈ వంతెన మంజూరు చేయడం జరిగిందన్నారు.అనంతరం చింతలపూడి గ్రామసచివాలయాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సచివాలయం ద్వారా ఏఏ సేవలందించుచున్నది సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మారేడుమిల్లి మండలం మారుమూల గ్రామం అయిన బంధ ఆశ్రమం పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ ఆశ్రమం పాఠశాలలోని ప్రతిరోజు విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు సకాలంలో అందజేయాలని అదేవిధంగా విద్యార్థులందరికీ ఈ సంవత్సరానికి సంబంధించిన సిలబస్ పూర్తి చేసి ఫైనల్ ఎగ్జామ్ కు సిద్ధం చేయాలని సంబంధిత ఉపాధ్యాయులను ఆయన ఆదేశించారు. ప్రాజెక్ట్ అధికారి వెంట చింతలపూడి సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ. ఎంపీటీసీ ముల్ల జోగిరెడ్డి. వైస్ సర్పంచ్ పల్లాల లచ్చిరెడ్డి. ఇ ఓ పి ఆర్ అండ్ ఆర్ డి మూర్తి. తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యుదయమే జగన్ ధ్యేయం...



విశాలాంధ్ర-దేవీపట్నం: మహిళా అభ్యుదయమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని మహిళల బతుకుల్లో వెలుగు నింపేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు జగన్ చేపట్టారని రంపచోడవరం మండలం తామరపల్లి సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి అన్నారు. శుక్రవారం తామరపల్లి పంచాయతీ సచివాలయంలో జరిగిన వై ఎస్ ఆర్ ఆసరా మూడోవ విడత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముసురిమిల్లి ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ ఆర్ ఆసరా ప్రతి మహిళ అభివృద్ధికి తోడ్పడుతుందని అలాగే మహిళల కోసం పథకాలెన్నో జగన్ అమలు చేయడం జరుగుతుందన్నారు. సున్న వడ్డీకే రుణాలు ఇస్తున్నారని చిన్న చిన్న వ్యాపారాలతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్ లక్ష్మి, గృహ సారధి బంధం లక్ష్మి,మాజీ ఎంపీటీసీ తురసం వీరయ్యమ్మ, వివో లు,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫలితాలు ప్రజా వ్యతిరేక పాలనకు పరాకాష్ట : మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి



విశాలాంధ్ర-దేవీపట్నం: ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి మనోబలాన్ని చేకూర్చగా వైసిపి కి ఎదురైన చేదు అనుభవాలుగా ఆ పార్టీ ప్రజా వ్యతిరేక పాలనకు పరాకాష్ట అని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ పట్టభద్రులు ఓట్లు దూరం కావటానికి ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల పై జగన్ సాధిస్తున్న కక్ష సాధింపు చర్యలే కారణమన్నారు. మూడు రాజధానులు కు ఉత్తరాంధ్ర ప్రజలు వ్యతిరేకమనే సత్యం ఇప్పటికైనా జగన్ కు బోధపడాలన్నారు చంద్రబాబు చాణక్య నీతితో అనూరాధ ను ఎమ్మెల్సీ చేసి చూపించారు అన్నారు. జగన్ నియంతృత్వ పోకడలతో ఆ పార్టీ ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా మారటం సిగ్గు చేటు అన్నారు.రాబోయే రోజుల్లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రజలే జగన్ కు గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా

విశాలాంధ్ర- చింతూరు: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం లోని నిమ్మలగూడెం గ్రామంలో ఉన్న ఆఫ్రిన్ ఆయుర్వేద ప్రముఖ వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ ఉపవాస పండుగ(రంజాన్) సందర్భంగా శుక్రవారం మండలంలోని 200 పేద ముస్లిం కుటుంబాల వారికి 25 కిలోల బియ్యం పంచదార కేజీ. గోధుమపిండి కేజీ. సేమ్యాలు కేజీ. పసుపు ఉప్పు కారం వంటి నిత్యాసర వస్తువులను అందజేశారు. ఒక్క కుటుంబానికి సుమారు రూ2వేల విలువైన బియ్యం సేమియా ఉప్పు పప్పులను అందజేస్తున్నారు. అంతేకాకుండా భర్తలను కోల్పోయిన వితంతువులకు ప్రత్యేకంగా ఫిత్ర పేరుతో ధన సహాయం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఎస్కే సుబహాని. తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పనులు వసూలు చేయాలి



విశాలాంధ్ర-పాయకరావుపేట రూరల్ : పంచాయతీల్లో నూరు శాతం పనులు వసూలుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఈవోపీఆర్డి సిహెచ్ చంద్రశేఖర్ ఆదేశించారు. మండలంలోని నామవరం, గుంటపల్లి, సీతారాంపురం, పాల్మాన్ పేట పంచాయతీ కార్యాలయాలను ఆయన సందర్శించారు. ఇచ్చిన లక్ష్యాలకు ఇంటి పన్నులు నూరు శాతం శాతం వసూలు చేయాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప(జె.ఎస్.ఎస్) యాక్టివిటీస్, పంచాయతీ సిబ్బంది పనితీరు, అలాగే గ్రామాల్లో పరిశుభ్రత పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.